సాక్షి నంద్యాల

శుక్రవారం | 18 | జులై | 2025



కళ్లు 'బేళ్లు' కమ్ముతున్నా..

చేతికొచ్చిన పంటను అమ్ముకోలేక.. దిగుబడిని నిల్వ చేసుకోలేక పొగాకు రైతులు దిగాలు చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. 8లో▸



మరణించినా ముగ్గురికి ప్రాణదానం

రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన యువకుని అవయవదానంతో మరో ముగ్గురికి ప్రాణదానం చేశారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 38,779
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 38,573

న్యూస్‌రీల్

ఎస్సార్బీసీకి జలకళ



కోవెలకుంట్ల సమీపంలోని ఎస్సార్బీసీ పదవ బ్లాక్ కాల్వలో నీటి ప్రవాహం

కోవెలకుంట్ల: మూడు రోజుల క్రితం గోరుకల్లు నుంచి ఎస్సార్బీసీకి విడుదల చేసిన నీరు బ్లాక్‌లకు చేరుతున్నాయి. శ్రీశైలం రిజర్వాయర్‌కు వరద పోటెత్తడంతో పోతిరెడ్డిపాడు నుంచి దిగువకు వదిలిన నీరు బానకచర్ల మీదుగా ఎస్సార్బీసీకి విడుదలవుతున్నాయి. బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న ఎస్సార్బీసీ కాల్వలు కృష్ణా జలాలతో కళకళలాడుతున్నాయి. కోవెలకుంట్ల పట్టణ శివారులోని 10వ బ్లాక్ కాల్వకు నీరు చేరింది. కాల్వ పరీవాహక ప్రాంత రైతులు వరి, మొక్కజొన్న, జొన్న, మినుము పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు.

లాటరల్ ఎంట్రీ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్ ఒకేషనల్ కోర్సు (ఐవీసీ) అభ్యర్థుల నుంచి లాటరల్ ఎంట్రీలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జి.శైలేంద్రకుమా ర్ తెలిపారు. ఇంటర్మీడియెట్ వొకేషనల్ కోర్స్ పాస్ అయిన విద్యార్థులు డిప్లొమోలోని మెకానిక్, సివిల్, ఎలక్ట్రికల్ విభాగాల్లో అడ్మిషన్ పొందుటకు అర్హులని తెలిపారు. సరైన ధ్రువపత్రాలతో ఈనెల 18వ తేదీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో దరఖాస్తులు దాఖలు చేసుకోవాలన్నారు. 19వ తేదీన కర్నూలు పాలిటెక్నిక్ ఫర్ మైనార్టీ కళాశాలలో జరిగే స్పాట్ అడ్మిషన్‌కు హాజరు కావాలన్నారు. సమాచారం కోసం 9912377723ను సంప్రదించాలన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు హాస్టల్ సదుపాయం

కర్నూలు(అర్బన్): నగరంలోని సి.క్యాంప్ శారీరక వికలాంగుల (దివ్యాంగుల) బాలుర వసతి గృహంలో ప్రవేశానికి ఉమ్మడి జిల్లా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా కోరారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 3వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీతో పాటు ఇతర కోర్సులు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. హాస్టల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి 100 మంది విద్యార్థులకు వసతి కల్పిస్తామన్నారు. ఈ నేపథ్యంలోనే బి.క్యాంప్‌లో రూ.2.86 కోట్ల వ్యయంతో అన్ని వసతులతో నూతన వసతి గృహాన్ని కూడా నిర్మిస్తున్నామన్నారు. దరఖాస్తులను వసతి గృహ సంక్షేమాధికారికి అందించాలన్నారు. మరిన్ని వివరాలకు 08518– 277864ను సంప్రదించాలన్నారు.

17 టన్నుల ఎరువుల విక్రయాలు నిలిపివేత



నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

గోస్పాడు: మండల కేంద్రం గోస్పాడులోని ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసి 17 టన్నుల ఎరువుల విక్రయాలను తాత్కాలికంగా నిలిపి వేశారు. గురువారం రాష్ట్రస్థాయి తనిఖీ బృందంలోని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి, విజిలెన్స్ ఎస్ఐ గోపాలుడు తదితరులు స్థానిక ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. కాగా శ్రీవెంకటసాయి ఫర్టిలైజర్స్ అండ్ ఫెర్టిసైడ్స్ ఎరువుల షాపును తనిఖీ చేశారు. 9:24:24 ఎరువు మందును గుర్తించి సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో దాదాపు రూ.8.13 లక్షల విలువైన 17.12 టన్నుల ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేశారు. వారి వెంట స్థానిక వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

నంద్యాల(అర్బన్)/దొర్నిపాడు: నంద్యాల జిల్లాలో బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. బనగానపల్లె మండలంలో అత్యధికంగా 37.0 మి.మీ, జూపాడుబంగ్లా మండలంలో అత్యల్పంగా 1.2 మి.మీ వర్షం కురిసింది. నంద్యాల అర్బన్‌లో 32.0, కోవెలకుంట్ల 31.4, కొలిమిగుండ్ల 30.0, ఆళ్లగడ్డ 29.6, బేతంచెర్ల 24.2, మహానంది 18.6, అవుకు 18.2, ఉయ్యాలవాడ 16.4, నంద్యాల రూరల్ 15.6, డోన్ 14.2, చాగలమర్రి 13.8, దొర్నిపాడు 11.2, ప్యాపిలి 6.8, సంజామల 6.4, గోస్పాడు 6.2, పాణ్యం 6.0, రుద్రవరం 4.2, బండిఆత్మకూరు 3.2, గడివేముల 2.2, వెలుగోడు 2.0, పగిడ్యాల 1.4 మి.మీ వర్షం కురిసింది. కుందూనదికి వరద నీరు పోటెత్తడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది.

నిన్ను తాక మనసాయె.. టికెట్టు భారమాయె!

- మల్లన్న ఉచిత స్పర్శదర్శనానికి ని'బంధనాలు'
- ఒక రోజు ముందు మాత్రమే ఆన్‌లైన్ దరఖాస్తు
- నెలలో ఒకసారి మాత్రమే ఉచితానికి అనుమతి
- ఆధార్ లాక్ పెట్టిన దేవస్థానం





శ్రీశైల మల్లికార్జునస్వామి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో సామాన్య భక్తుల సౌకర్యార్థం పునఃప్రారంభించిన మల్లన్న ఉచిత స్పర్శ దర్శనానికి దేవస్థానం రోజుకో నిబంధన పెడుతోంది. ఆన్‌లైన్ దరఖాస్తు తప్పనిసరి చేయడంతో పాటు నెలలో ఒకసారి మాత్రమేనంటూ దేవస్థానం వెబ్‌సైట్‌లో భక్తుల ఆధార్ లాక్ పెట్టడం గమనార్హం. ఏ క్షేత్రంలో లేని విధంగా శ్రీశైల మహాక్షేత్రంలో పరమశివుడైన మల్లికార్జున స్వామివారిని భక్తులు స్వయంగా తాకి (స్పర్శ) దర్శనం చేసుకోవచ్చు. పరమేశ్వరుడు అభిషేక ప్రియుడు. అభిషేక ప్రియుడికి ఆయనపై కొన్ని స్వచ్ఛమైన నీటిని పోసి, మారేడుదళం, బిల్వదళంతో అర్చిస్తే..సంబరపడి పోయి కోరిన కోర్కెలు తీర్చుతారని భక్తుల నమ్మకం. కాగా సామాన్య భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఈ నెల 1వ తేదీ నుంచి ప్రతి మంగళవారం నుంచి శుక్రవారం వరకు మల్లన్న ఉచిత స్పర్శదర్శనాన్ని పునఃప్రారంభించారు. శ్రీశైల మల్లన్న ఉచిత స్పర్శ దర్శనంలో జవాబుదారీతనం, పారదర్శకతకోసం కొత్తగా టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఏ రోజుకారోజు కౌంటర్ల ద్వారా టోకెన్లను జారీ చేశారు. కంప్యూటరైజ్డ్ టోకెన్లలో భక్తుని పేరు, ఆధార్, ఫోన్ నెంబర్‌ను నమోదు చేసి టోకెన్లను ఇచ్చారు. ఈ టోకెన్లను

ఉచిత స్పర్శదర్శనానికి ఆన్‌లైన్‌లో..

శ్రీశైల దేవస్థానం పునఃప్రారంభించిన మల్లన్న ఉచిత స్పర్శదర్శనానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని దేవస్థానం కొత్త నిబంధన పెట్టింది. శ్రీశైల దేవస్థానం వెబ్‌సైట్ ద్వారా ఇతర ఆర్జిత సేవా టికెట్లు పొందేవిధంగా ఉచిత స్పర్శదర్శనానికి సైతం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని నిబంధన పెట్టారు. దర్శనానికి ఒకరోజు ముందుగా ఆన్‌లైన్‌లో టికెట్టు బుక్ చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీని, ఆధార్ జిరాక్స్‌ను తీసుకొస్తేనే ఉచిత స్పర్శదర్శనానికి అనుమతిస్తున్నారు.

ఉచిత దర్శనం క్యూలైన్ ప్రవేశద్వారం వద్దనున్న స్కానింగ్ ద్వారా తనిఖీ చేసి భక్తులను ఉచిత స్పర్శదర్శనానికి అనుమతించారు. రోజుకు 1000 నుంచి 1200 టోకెన్లను జారీ చేశారు. అలాగే స్పర్శదర్శనానికి పురుషులు తెల్ల పంచె, మెడలో తెల్లకండువా.. మహిళలు చీర, రవిక, చున్నీతో కూడిన సల్వార్ కమీజ్‌లను ధరించాల్సి ఉంటుంది.

ఆర్జితసేవా టికెట్ల రుసుం.. ప్రియం

జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జున స్వామివారి గర్భాలయంలో అభిషేకం చేయాలంటే రూ.5 వేలు సమర్పించాల్సిందే. సామాన్యులు అంత పెద్ద మొత్తం వెచ్చించి అభిషేకం చేయించుకోలేని పరిస్థితి. సామూహిక అభిషేకం (రూ.1,500)సేవ ఉంది. ఈ సేవలో ప్రత్యేక మండపంలో భక్తులందరినీ సామూహికంగా కూర్చోపెట్టి అభిషేకాది పూజలు నిర్వహించిన అనంతరం కలశంలో నీటిని తీసుకుని స్వామివారి మీద పోసి దర్శించుకుంటారు. అయితే గర్భాలయంలో స్వామి చెంత అభిషేకం చేయలేదనే అసంతృప్తి భక్తుల్లో నెలకొంటుంది. అలాగే మల్లన్న స్పర్శదర్శనం చేసుకునేందుకు భక్తులు (ఒక్కొక్కరికి) దేవస్థానానికి రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. దీంతో చాలా మంది సామాన్య భక్తులు మల్లన్నను స్పర్శదర్శనం చేసుకోలేక పోతున్నారు. భార్య, భర్త, ముగ్గురు పిల్లలు ఉన్న చిన్నపాటి కుటుంబం మల్లన్నను స్పర్శదర్శనం చేసుకోవాలన్నా రూ.2,500 చెల్లించాలి. చాలా మందికి మల్లన్నను స్పర్శదర్శనం చేసుకోవాలని కుతూహలం ఉన్నప్పటికీ ఆర్థిక స్థోమత లేక చాలా మంది దూర (దూళి) దర్శనం చేసుకుంటున్నారు.

నెలలో ఒకసారి మాత్రమే..?

దేవస్థానం కల్పిస్తున్న ఉచిత స్పర్శదర్శనం భక్తులు నెలలో ఒకసారి మాత్రమే నిర్వహించుకునేలా దేవస్థానం వెబ్‌సైట్‌లో మార్పులు చేస్తున్నారు. ఒక భక్తుడు తన ఆధార్‌కార్డుపై ఒక రోజు ఉచిత మల్లన్న స్పర్శదర్శనం టికెట్టు బుక్ చేసుకుంటే అతని ఆధార్ కార్డును నెల రోజుల పాటు దేవస్థానం వెబ్‌సైట్‌లో లాక్ పెడతారు. నెల తరువాతనే అతని ఆధార్‌కార్డుపై ఉచిత స్పర్శదర్శనం టికెట్టు బుక్ అవుతుంది.

కుంకుమార్చన రూ.1000

అష్టాదశ శక్తిపీఠమైన భ్రమరాంబాదేవి ఆలయంలో అమ్మవారి గర్భాలయం ఎదురుగా శ్రీచక్రం ముందు కూర్చుని కుంకుమార్చన చేయాలంటే రూ.1000 చెల్లించాల్సిందే. అంతేకాకుండా భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లను (దూళి) దర్శించుకోవాలంటే రూ.150 సేవా రుసుంతో శీఘ్ర దర్శనం, రూ.300 టికెట్టు ధరతో అతిశీఘ్ర దర్శనం పేరుతో దేవస్థానం ఏర్పాటు చేశారు. అలాగే ఉభయ దేవాలయాల్లో అంతే కాకుండా స్వామిఅమ్మవార్ల కల్యాణం, రుద్రహోమం, చండీహోమం, ఇలా ఏ ఆర్జిత సేవ అయినా రూ.1000 ఆ పైనే ఉంటుంది. ఇప్పటికైన దేవస్థాన అధికారులు స్వామి వారి దర్శనం సామాన్యులకు లభించేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

హామీల అమలులో 'కూటమి' విఫలం

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి



బాబు వంచనపై వివరాలు సేకరిస్తున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి విమర్శించారు. పుసులూరు గ్రామంలో గురువారం సాయంత్రం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, ఇంటింటికి వంచన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్ రెడ్డి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ క్యూఆర్ కోడ్ ద్వారా గత ఏడాది కాలంలో ప్రతి కుటుంబం ఎంత నష్టపోయారో వివరించారు. కొత్త పింఛన్లు ఇవ్వడం లేదని, మహిళలకు ఉచిత బస్సు అమలు కావడం లేదని ప్రజలు తమ గోడును వెళ్లబోసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారెడ్డి, మోహన్ రెడ్డి, రవిప్రకాష్ రెడ్డి, సోమన్న, పార్టీలో వివిధ విభాగాల్లో పదవులు పొందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె ఎఫెక్ట్

- నాలుగు రోజులుగా మంచినీటి సరఫరా బంద్
- ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్న అధికారులు



38వ వార్డులో ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకుంటున్న మహిళలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లా కేంద్రం నంద్యాల పట్టణ వాసులకు నీటి కష్టాలు మొదలయ్యాయి. ట్యాంకర్ కనిపిస్తే జనం బారులు దీరుతున్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు సమ్మెలో ఉండటంతో మంచినీటి సరఫరా పైప్‌లైన్లు లీకేజీలు, పగిలిపోవడంతో మరమ్మతులు చేసే వారు లేరు. దీంతో పట్టణంలో నాలుగు రోజులుగా పలు కాలనీల్లో నీటి సమస్య ఏర్పడింది. సమస్య తీవ్రతరం కావడంతో అధికారులు ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నారు. అయితే అరకొరగా సరఫరా చేస్తుండటంతో ప్రజల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ప్రజా ప్రతినిధులు చెప్పిన వారికి మాత్రమే ట్యాంకర్లు పంపిణీ చేస్తున్నారంటూ కొంత మంది ఆరోపిస్తున్నారు. నీళ్లు లేకపోవడంతో మినరల్ వాటర్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. కాగా తమ డిమాండ్లు పరిష్కరించేంత వరకు సమ్మె విరమించే ప్రసక్తి లేదని మున్సిపల్ కార్మికులు చెబుతున్నారు. కార్మికులందరికీ ప్రభుత్వ పథకాలతో పాటు అన్ని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

యూరియా కోసం పాస్ పుస్తకాలను వరుసలో పెట్టి నిరీక్షిస్తున్న రైతులు



యూరి'యా'తన'!

- క్యూలో నిల్చున్నా అందని వైనం
- రైతులకు తప్పని తిప్పలు

రైతులకు ఎక్కడి లేని కష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తెచ్చి పెట్టింది. పంటలకు కావాల్సిన ఎరువుల్ని స్టాక్ లేకుండా చేసింది. ముందస్తుగా వచ్చిన వర్షాలతో రైతులు కొన్ని పంటలు వేశారు. అవి పండితే అప్పులు తీరుతాయని అన్నదాతలు అనుకుంటున్న తరుణంలో పంటల ఎదుగుదలకు అవసరమైన యూరియా కరువైంది. దీంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. రైతులందరికీ కౌతాళం రైతు సేవా కేంద్రం వద్ద యూరియా ఇస్తామని చెప్పారు. దీంతో గురువారం రైతులు వందలాదిగా తరలివచ్చారు. తమ పట్టాదారు పాస్‌పుస్తకాలను వరుస పద్ధతిలో క్యూలో పెట్టుకుని నిరీక్షించారు. మధ్యాహ్నం వచ్చిన మూడు, అనంతరం వచ్చిన మరో మూడు లోడ్లు రైతులకు ఏ మాత్రం సరిపోలేదు. దీంతో వ్యవసాయాధికారి శేషాద్రితో రైతులు చాలాసేపు వాగ్వాదం చేశారు. అనంతరం మరో రెండు లోడ్ వచ్చినా రైతులకు సరిపోలేదు. యూరియా కోసం అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిందని రైతులు మండిపడ్డారు.

– కౌతాళం

కష్టాలు వినలేదు.. వరాలు ఇవ్వలేదు

- టీడీపీ సభను తలపించిన రైతుసభ



ఎమ్మెల్యేలకు అవకాశం లేని సభావేదిక

నందికొట్కూరు: మల్యాల ఎత్తిపోతల నుంచి హంద్రీనీవా కాలువకు నీటి విడుదల చేసేందుకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతులు, ప్రజల కష్టాలు తెలుసుకోలేదు. ఇచ్చిన హామీలపై ఎటువంటి ప్రకటనా చేయలేదు. దీంతో నియోజకవర్గ ప్రజలు నిరాశ చెందారు. గురువారం మల్యాల ఎత్తిపోతలను సందర్శించి మోటార్లు ఆన్ చేసి కాల్వలకు నీటిని విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన రైతు సభలో జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొంత మంది ఎమ్మెల్యేలను వేదికపైకి ఆహ్వానించలేదు. ఆర్థిక శాఖ మంత్రి, నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ పయ్యావుల కేశవ్ సీఎం చంద్రబాబు మెప్పు కోసమే మాట్లాడినట్లు కనిపించింది. సీఎం బాబు పాలనలో ప్రజలందరూ సుభిక్షంగా ఉన్నారని పొగడ్తలతో ముంచెత్తారు. నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య ఒక మిడుతూరు మండలం ఎత్తిపోతల పథకం గురించి ప్రస్తావించడంతో మిగతా మండలాల ప్రజలు తమ సమస్యలు ఎమ్మెల్యేకు కనబడటం లేదా.. అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక మండలానికి మాత్రమే ఎమ్మెల్యేనా అని.. సభకు వచ్చిన రైతులు, ప్రజలు మండిపడ్డారు. నీటి ముంపు బాధితులకు సీఎం ఎలాంటి హామీ ఇవ్వకపోవడంతో ఆందోళన చెందారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చి విస్మరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

ఒప్పందం ప్రకారం కొనుగోలు చేయాలి



రోడ్డుపై బైఠాయించిన పొగాకు రైతులు

గడివేముల: రైతుల నుంచి పొగాకు యాజమాన్యం కుదుర్చున్న ఒప్పందం ప్రకారం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని నంద్యాల – నందికొట్కూరు ప్రధాన రహదారిపై జీపీఐ కొనుగోలు కేంద్రం వద్ద వివిధ ప్రాంతాలకు చెందిన పొగాకు రైతులు ధర్నా నిర్వహించారు. సాగు చేసే సమయంలో జీపీఐ కంపెనీ అధికారులు రైతుల నుంచి రూ 12 వేల నుంచి 18 వేల వరకు పొగాకు కొనుగోలు చేస్తామని ఒప్పందం కుదుర్చుకుని ప్రస్తుతం రూ. 3 వేలకు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పడం మోసం చేయడమేనన్నారు. పొగాకు రైతులను మోసం చేసిన జీపీఐ కంపెనీపై చర్యలు తీసుకోవాలని కోరారు. పొగాకు రైతులు ధర్నాతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పోలీసులు జోక్యం చేసుకొని ఉన్నతాధికారులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.

శ్రీశైల దేవస్థానానికి విజిలెన్స్ కమిటీ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానానికి విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేసూ ఈఓ శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. స్పర్శ దర్శనం టిక్కెట్లు మార్పింగ్, టిక్కెట్లు లేకుండా దర్శనాలకు వెళ్లడం, ఇంజినీరింగ్ పనుల్లో అవకతవకలు, ఆయా విభాగాల్లో చోటు చేసుకుంటున్న అవినీతి ఇలా పలు విషయాలపై నూతనంగా విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులుగా డిప్యూటీ ఈవో రమణమ్మ, ఏఈఓ మల్లికార్జున రెడ్డి, ఇన్‌చార్జ్ డీఈ పి.వి.సుబ్బారెడ్డి, పర్యవేక్షకులు మల్లికార్జునను నియమించారు.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి చర్యలు

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో(ఇంగ్లిష్ మీడియం) మిగులు సీట్ల భర్తీకి చర్యలు చేపట్టినట్లు కన్వీనర్ బి.ఫ్లోరమ్మ తెలిపారు. 2025–26 సంవత్సరానికి 6, 7, 8, 9 తరగతుల్లో ఏర్పడిన ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సీట్ల భర్తీకి ఈనెల 25న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈనెల 18 నుంచి 20వ తేదీ లోపు కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని 9 పాఠశాలల్లో ఎక్కడైనా దరఖాస్తు ఫారాలను పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ఈనెల 22, 23 తేదీలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల్లోపు నంద్యాల జిల్లాలోని ఎంజేపీబీసీడబ్ల్యూఆర్ స్కూల్ అండ్ కాలేజ్ (నెరవాడ, పాణ్యం మండలం)లో అందజేసి హాల్ టిక్కెట్ తీసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9866559668, 7569071907 నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

'విభిన్న' చిన్నారుల భవితకు భరోసా

- జిల్లాలో కొత్తగా 267 మంది దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు
- వీరికి సమీప పాఠశాలల్లో అడ్మిషన్లు

నంద్యాల(న్యూటౌన్): విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులకు ఉజ్వల భవిత అందనుంది. జిల్లాలో మే 13 నుంచి జూన్ చివరి తేదీ వరకు ప్రత్యేక సర్వే నిర్వహించి 267 మంది దివ్యాంగ విద్యార్థులను గుర్తించారు. వీరందరికీ ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలు అందేలా జిల్లా అధికారులు సమగ్ర నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించారు.

యూ–డైస్‌లో నమోదు

విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులను మండల యూనిట్‌గా లెక్కించారు. జిల్లాలో ఇప్పటికే 5,369 మంది దివ్యాంగ విద్యార్థులు ఉన్నారు. వీరితో పాటు కొత్తగా గుర్తించిన 267 మంది విద్యార్థులను సమీప ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశం కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆధార్‌కార్డును అనుసంధానం చేస్తూ ఆయా పాఠశాలల యూ–డైస్ కోడ్లో విద్యార్థుల వివరాలను నమోదు చేశారు. దీంతో ప్రత్యేక అవసరాల పిల్లల వాస్తవ గణాంకాల్లో పారదర్శకతతో పాటు వారు ఎక్కడ చదువుతున్నారనేది తెలుసుకునే అవకాశం ఉంది.



భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులను గుర్తిస్తున్న అధికారులు

ఇళ్లకు వెళ్లి బోధన

ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు సాధారణ విద్యార్థులతో సమానంగా విద్యనందించేందుకు కేంద్ర ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో 29 భవిత కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ కేంద్రాలకు 8 ఫిజియోథెరపిస్టులు చిన్నారులకు సేవలందిస్తున్నారు. అలాగే శారీరక, మానసిక వైకల్యంతో ఉన్న చిన్నారులు కావటంతో వీరికి ఆటపాటలతో చదువులు చెప్పాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలోనే అవసరమైన ఆట పరికరాలు, వస్తువులను కేంద్రాలకు సమకూరుస్తున్నారు. ప్రతి భవిత కేంద్రంలో ఇద్దరు ఇంక్లూజీవ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్‌లు (ఐఈఆర్‌పీలు) చిన్నారులకు విద్యను అందిస్తారు. వీరితో పాటు ప్రతి కేంద్రంలో ఒకరిని ఆయాగా నియమించారు. శారీరక వైకల్యం అధికంగా ఉన్న చిన్నారులకు ఇంటి వద్దనే ఆవసరమైన వైద్య సేవలు అందించేలా ఫిజియోథెరపిస్టులను ఏర్పాటు చేశారు. ప్రతి శనివారం హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా పాఠశాలకు వెళ్లని విభిన్న ప్రతిభావంతులైన చిన్నారుల ఇళ్లకు వెళ్లి ఐఈఆర్‌పీలు బోధన చేస్తారు.

జిల్లాలో పరిస్థితి ఇది..

జిల్లాలో భవిత కేంద్రాలు	29
ప్రత్యేక అవసరాల పిల్లలు	5369
భవిత కేంద్రాలకు వచ్చే వారు	555
హోం బెస్ట్ ఎడ్యుకేషన్ పొందుతున్న వారు	591
కేంద్రాల్లో ఐఈఆర్‌పీలు	58
ఆయాలు	29
ఫిజియో థెరపిస్ట్‌లు	08

ప్రతి ఒక్కరికి అడ్మిషన్లు ఇస్తున్నాం



సర్వే ద్వారా గుర్తించిన ప్రత్యేక అవసరాల గల చిన్నారులకు పాఠశాలల్లో అడ్మిషన్లు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం. భవిత కేంద్రాల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. కేంద్రాల పనితీరును మెరుగుపరచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

–జగన్‌మోహన్‌రెడ్డి, సహిత విద్య, జిల్లా కో ఆర్డినేటర్, నంద్యాల

నైపుణ్యాలు పెంపొందిస్తున్నాం



ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు నైపుణ్యాలను పెంపొందించేందుకు' ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నాం. శారీరక, మానసిక పరిస్థితికి అనుగుణంగా వారికి అవసరమైన విద్యను భవిత కేంద్రాల ద్వారా కల్పిస్తున్నాం. వారికి అవసరమైన ఉపకరణాలు అందించడంతో పాటుగా, అలవెన్సులను అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. భవిత కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సిబ్బంది ఉన్నారు.

–ప్రేమాంతకుమార్, జిల్లా సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్, నంద్యాల

క్లుప్తంగా

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి

- ఎడమ చేతిపై గుజరాతీ భాషలో పచ్చబొట్టు


మృతి చెందిన యువకుడు

ఆదోని సెంట్రల్: రైలు నుంచి జారిపడి గురువారం ఒక యువకుడు మృతి చెందాడు. అతను ఎవరో, ఎక్కడి నుంచి ఎక్కడికి వెళుతున్నారో, ఏ రైలు నుంచి జారీ పడ్డాడో పూర్తి సమాచారం దొరక లేదని రైల్వే హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు తెలిపారు. మృతదేహం ఆదోని–ఇస్వి ఆర్‌ఎస్‌ల మధ్య కనిపించిందని చెప్పారు. మృతుడి ఎడమ చేతిపై గుజరాతీ భాషలో పచ్చబొట్టు ఉందని, గుర్తుపట్ట కలిగిన వారు తమను సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సిమ్‌ బ్లాక్‌ చేసి.. డబ్బు కాజేసి!

దేవనకొండ: ఫోన్‌ సిమ్‌ను బ్లాక్‌ చేసి.. ఫోన్‌పే ద్వారా డబ్బు కాజేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. దేవనకొండ మండలంలోని తెర్నేకల్‌ గ్రామానికి చెందిన శాలుబి(62) అనే వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శాలుబీకి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ఖాతా ఉంది. ఖాతాలో పంటల ఇన్సూరెన్స్‌ బీమా, ఎల్‌ఐసీ ఇన్సూరెన్స్‌కు సంబంధించిన రూ.60 వేలు, పొదుపు లోన్‌ తీసుకున్న రూ.1.50 లక్షలు మొత్తం రూ.2 లక్షలు దాకా సేవింగ్‌ ఖాతాలో ఉంది. ఈమె ఫోన్‌ నంబర్‌తో బ్యాంక్‌ అకౌంట్‌కు అనుసంధానం ఉంది. అదే ఫోన్‌ నంబర్‌తో ఫోన్‌పే ఉంది. ఈనెల 7వ తేదీన ఈమెక ఫోన్‌కు చెందిన సిమ్‌ బ్యాక్‌ అయ్యింది. 16వ తేదీ కొత్త సిమ్‌ తీసుకుని యాక్టివేట్‌ చేయగా బ్యాంకు ఖాతా నుంచి రూ.2 లక్షలు డ్రా చేసినట్లు మెసేజ్‌ వచ్చింది. దీంతో ఆమె బ్యాంకుకు వెళ్లి సంప్రదించగా ఈనెల 8వ తేదీన రూ.లక్ష, 9వ తేదీన రూ.లక్ష ఫోన్‌ పే ద్వారా డ్రా చేసినట్లు స్టేట్‌మెంట్‌లో బయటపడింది. దీంతో ఒక్కసారిగా విస్తుపోయిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాలిటెక్నిక్‌ కాలేజీల్లో 19న 'స్పాట్‌' అడ్మిషన్లు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్‌ ఒకేషనల్‌ కోర్స్, బ్రిడ్జ్‌ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఉన్న పాలిటెక్నిక్‌ కాలేజీల్లో ఈనెల 19న స్పాట్‌ అడ్మిషన్స్‌ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్‌ మైనార్టీ కాలేజీ ప్రిన్సిపాల్‌ వీ.ఎస్‌.వీ.సీహెచ్‌ శ్రీనివాస ప్రసాద్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకొని నేరుగా హాజరుకావొచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9912342098ను సంప్రదించవచ్చునని తెలిపారు.

కళ్లు 'బేళ్లు' కమ్ముతున్నా.. కనికరం లేదు!

- ఒప్పందాన్ని మట్టిలో కలిపేసిన పొగాకు కంపెనీలు
- అమ్ముకోలేక రైతుల ఇళ్ల ముంగిట దిగుబడులు
- మార్కెట్‌ సౌకర్యం కల్పించాలని డిమాండ్‌
- పాలకులకు పట్టని అన్నదాత కష్టాలు


కరివేనలో రైతు ఇంటి ముంగిట నిల్వ ఉన్న పొగాకు


కొత్త రామాపురంలో రైతు కల్లంలో పొగాకు బేళ్లు

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి పొగాకు రైతులు కుదేలవుతున్నారు. కంపెనీల చేతిలో మోసపోయిన రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోంది. అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమను ఆదుకోవాలని రైతులు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్న తమకేమీ పట్టనట్లు పాలకులు, అధికారులు వ్యవహరిస్తున్నారు. చేతికొచ్చిన పంటను అమ్ముకోలేక.. దిగుబడిని నిల్వ చేసుకోలేక దిగాలు చెందుతున్నారు. నంద్యాల జిల్లా ప్రాంతానికి చెందిన రైతాంగానికి ఇప్పటికీ ఆదోని, కర్నూలు మార్కెట్‌లే పెద్ద దిక్కుగా నిలిచాయి. జిల్లాలో పండించే వేరుశనగ, మొక్కజొన్న, పొగాకు, పత్తి, కంది తదితర పంటలు సైతం ఈ ప్రాంత వ్యాపారులు, దళారులు కొనుగోలు చేయపోతే నేరుగా కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు తరలించి ధాన్యాన్ని విక్రయిస్తారు. పత్తి దిగుబడిని ఆదోని మార్కెట్‌యార్డుకు తరలిస్తారు. జిల్లా కేంద్రం నంద్యాలలో ప్రధాన పంటల మార్కెటింగ్‌ సౌకర్యం లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. జిల్లాలో గతేడాది మధ్య పంటగా పొగాకును రైతులు విస్తారంగా సాగు చేశారు. దాదాపు 30 వేల ఎకరాల్లో పండించారు. ప్రధానంగా ఆత్మకూరు, నందికొట్కూరు, ఆళ్లగడ్డ, బనగానపల్లె, పాణ్యం నియోజకవర్గాల్లో దాదాపు 25 మండలాల్లో పొగాకును సాగుచేశారు. అయితే ఇక్కడ పొగాకు కొనుగోలు కేంద్రం లేకపోవడం వల్ల పొగాకు కంపెనీలే రైతులకు దిక్కు అయ్యాయి. అయితే సాగుకు ముందు ఒప్పందం చేసుకున్న కంపెనీలు మోసం చేయడంతో నష్టాలు మూటగట్టుకున్నారు. ప్రధానంగా జీపీఐ, అలియన్స్‌ ఈ కంపెనీలు క్వింటా రూ.15 వేలు దాకా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి చివరకు అరకొరగా తక్కువ ధరకు కొనుగోలు చేసి ఉన్నఫలంగా చేతులెత్తేశాయి. ఇక రైతులు ఏమి చేయలేక ఇళ్లు, కల్లాల్లో పొగాకు బేళ్లను నిల్వ ఉంచారు. దీనికితోడు ఏప్రిల్, మే నెలలో వర్షాలు కురవడంతో పొగాకు దెబ్బతింది. రైతులు రూ. లక్షలు నష్టపోయారు. గుంటూరు తరహాలో నంద్యాలలో కూడా పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఉంటే నేరుగా అక్కడికి తరలించి విక్రయించే అవకాశం ఉండేదని చెబుతున్నారు.

కళ్లెదుట నిల్వలు..

కంపెనీలు మోసం చేయడంతో ఇప్పటికీ కొందరు రైతుల వద్ద 30 నుంచి వంద క్వింటాళ్ల దాకా పొగాకు నిల్వలు గుట్టలుగా కనిపిస్తున్నాయి. ఒక్క కరివేన గ్రామంలోనే దినకర్‌ 100 క్వింటాళ్లు, గౌతం 150, ఎల్లారెడ్డి 150, శేషయ్య 60, సుదర్శన్‌ 65, రవి 50, కుమ్మరి రవీంద్ర 70, పాపన్న వంద, మద్దిలేటి 100, కురువ శీన 50, పి.నాగేంద్రుడు 100, రమణ, మల్లయ్యల వద్ద వంద క్వింటాళ్ల దాకా పొగాకు నిల్వలు ఉన్నాయి. పొగాకును అమ్ముకోలేక, ఇళ్లలో దాచుకోలేక రైతుల అవస్థలు అన్నీఇన్నీ కావు. ఓ వైపు కళ్ల ముందు విలువైన పంట.. మరోవైపు వేధిస్తున్న అప్పుల భారంతో సతమతమవుతున్నారు.

ఎమ్మెల్యేలు, ఎంపీకి రైతుల సమస్య పట్టదా?

కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమవుతోంది. వరి, పత్తి, మిరప రైతులు నష్టాలకే దిగుబడులు అమ్మేసుకున్నారు. సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దిగుబడులను దళారుల చేతిలో పెట్టి మోసపోతున్నారు. జిల్లాలో పొగాకు రైతులు ఇబ్బందులు పడుతున్నా ఎమ్మెల్యేలు, ఎంపీ పట్టించుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సత్వరమే పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేసేలా ఎమ్మెల్యేలు, ఎంపీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

ఆత్మహత్యలే శరణ్యం



నేను 40 ఎకరాల్లో పొగాకు సాగు చేశాను. హామీ ఇచ్చిన కంపెనీలు కొనుగోలు చేస్తే రూ.16 లక్షల వరకు సొమ్ము వస్తుంది. కంపెనీలు మోసగించడంతో లక్షలాది రూపాయల విలువైన పొగాకును ఇంటి ముందు పెట్టుకున్నాను. ఎన్నాళ్లు కాపాడుకోవాలి. పొగాకును కంపెనీలు, ప్రభుత్వం దిగుబడులు కొనుగోలు చేయకపోతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యం.
– కుమ్మరి సుదర్శన్, కరివేన గ్రామ రైతు, ఆత్మకూరు మండలం

హామీని నిలబెట్టుకోవాలి



రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రైతులతో అగ్రిమెంట్లు చేసుకున్న కంపెనీలు పొగాకు రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని న్యాయం చేయాలి. పొగాకును అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నాం. రూ. లక్షలు పెట్టుబడి పెట్టి అప్పులపాలయ్యాం. కంపెనీలు కొనుగోలు చేయకపోతే రైతులందరం కలసి ఉద్యమానికి సిద్ధమవుతాం.– శేషయ్య, కరివేన రైతు, ఆత్మకూరు మండలం

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



పొగాకు రైతులను ఆదుకునేందుకు జిల్లా కేంద్రం నంద్యాలలో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి. ఈ ప్రాంతంలో పొగాకును సాగుచేసిన రైతులను వెంటనే ఆదుకోవాలి. లేనిపక్షంలో రైతులు కోట్లాది రూపాయలు నష్టపోయే ప్రమాదం ఉంది. ఒప్పందాలు చేసుకుని కొనుగోలు చేయని కంపెనీలపై చర్యలు తీసుకోవాలి.
– రాముడు, కరివేన రైతు, ఆత్మకూరు మండలం

మరణించినా ముగ్గురికి ప్రాణదానం

- బ్రెయిన్‌ డెడ్‌ అయిన యువకుని అవయవదానం


తరుణ్‌(ఫైల్‌)

కర్నూలు(హాస్పిటల్‌): రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్‌ డెడ్‌ అయిన యువకుని అవయవదానంతో మరో ముగ్గురికి ప్రాణదానం చేశారు. నంద్యాల జిల్లా పాములపాడు మండలం కొత్త భానకచర్ల గ్రామానికి చెందిన మొలక రాజు, ఈశ్వరమ్మల కుమారుడైన మొలక తరుణ్‌(21) ఈ నెల 9వ తేదీన స్కూటర్‌పై వెళుతూ పాములపాడు సమీపంలో అదుపు తప్పి కిందపడ్డాడు. కర్నూలులోని గౌరీగోపాల్‌ ఆసుపత్రిలో ఈనెల 10వ తేదీన చేరాడు. చికిత్స పొంది ఈ నెల 14వ తేదీన మెడికవర్‌ హాస్పిటల్‌లో చేరి చికిత్స పొందుతూ 16వ తేదీన అతను బ్రెయిన్‌ డెడ్‌ అయ్యాడు. దీంతో జీవన్‌దాన్‌ ద్వారా అవయవదానం గురించి అతని కుటుంబసభ్యులకు అవగాహన కల్పించారు. దీంతో అవయవదానానికి కుటుంబసభ్యులు అంగీకరించడంతో గురువారం మెడికవర్‌ హాస్పిటల్‌లో అవయవాలను శస్త్రచికిత్స ద్వారా సేకరించారు. శస్త్రచికిత్సలో యురాలజిస్టు డాక్టర్‌ అబ్దుల్‌ సమద్, నెఫ్రాలజిస్టు డాక్టర్‌ సిద్దార్థ్‌ హెరూర్, అనెస్తెటిస్ట్‌ డాక్టర్‌ ప్రవీణ్‌ పాల్గొన్నారు. అనంతరం గ్రీన్‌ చానల్‌ ద్వారా సేకరించిన అవయవాల్లో పోలీసుల సహకారంతో ఇన్‌చార్జ్‌ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ ఎల్‌.భాస్కర్‌ ఆధ్వర్యంలో ఊపిరితిత్తులను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, ఒక కిడ్నీని కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, మరో కిడ్నీని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. అనంతరం తరుణ్‌ తల్లిదండ్రులను ఇన్‌చార్జ్‌ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ ఎల్‌.భాస్కర్, ఆసుపత్రి క్లస్టర్‌ హెడ్‌ మహేశ్వరరెడ్డి, వైద్యులు తదితరులు సన్మానించారు.

మేలైన యాజమాన్య పద్ధతులతోనే సాగులో రాణింపు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్‌): ప్రధాన ఉద్యాన పంటలైన ఉల్లి, మిరప, పసుపు సాగులో మేలైన యాజమాన్య పద్ధతులతో రాణించవచ్చని జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు తెలిపారు. గురువారం కర్నూలులోని ఉద్యాన భవన్‌లో ఆయా పంటల సాగుపై రైతులకు, గ్రామ ఉద్యాన సహాయకులు, ఉద్యాన సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్‌ వైఎస్‌ఆర్‌ ఉద్యాన విశ్వవిద్యాలయం, మహానందిలోని హెచ్‌ఆర్‌ఎస్‌ శాస్త్రవేత్తలు హాజరై మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 25,122 హెక్టార్లలో ఉల్లి సాగవుతుందని, అయితే ఉత్పాదకతను పెంచడంలో వెనుకబడి ఉన్నామని తెలిపారు. చక్కటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే హెక్టారుకు సగటున 150 క్వింటాళ్ల ఉత్పాదకతను పొందవచ్చన్నారు. మిరప సాగు కూడా ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎక్కువగా ఉందని.. నల్లతామర, వైరస్‌ తెగుళ్లను నివారించుకుంటే దిగుబడులు పెంచుకోవచ్చన్నారు. మహానంది ఉద్యాన పరిశోధన స్థానం సీనియర్‌ శాస్త్రవేత్త ఠాగూర్‌ నాయక్‌ మాట్లాడుతూ ఉల్లి, పసుపు, మిరప సాగు పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ అదనపు పీడీ ఫిరోజ్‌ ఖాన్, ఎస్‌హెచ్‌ఆర్‌డీఎఫ్‌ ప్రతినిధి శరవనన్, జిల్లాలోని ఉద్యాన అధికారులు అనూష, శ్రీవాణి, మదన్‌మోహన్‌గౌడు, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచక్ర హాస్పిటల్‌ వద్ద ఉద్రిక్తత

- యువతి మృతిపై కుటుంబ సభ్యుల ఆందోళన
- ఆసుపత్రిపై దాడులు, అద్దాలు ధ్వంసం


మృతి చెందిన అనిత



మృతురాలి కుటుంబీకుల దాడిలో ధ్వంసమైన ఆసుపత్రిలోని కిటికీలు, తలుపులు

కర్నూలు/కర్నూలు(హాస్పిటల్‌): జ్వరం కారణంగా చికిత్సకు వచ్చి యువతి మృతి చెందడంతో ఆమె కుటుంబసభ్యులు గురువారం కర్నూలులోని శ్రీ చక్ర హాస్పిటల్‌ వద్ద ఆందోళన నిర్వహించారు. ఆసుపత్రిపై దాడులు చేసి గాజుతో తయారు చేసిన కిటికీలు, తలుపులు ధ్వంసం చేశారు. వంద మందికి పైగా నిర్వహించిన ఈ దాడితో ఆ ప్రాంతంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అనంతపురం జిల్లా పామిడికి చెందిన అనిత(21)కు స్థానిక కల్లూరు ఎస్టేట్‌లోని పోలీస్‌ కాలనీకి చెందిన ప్లాట్ల రమణ కుమారుడు నాగేంద్రతో ఏడాది క్రితం వివాహం జరిగింది. నాగేంద్ర తండ్రితో కలిసి రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో అనితకు ఈ నెల 15వ తేదీ జ్వరం రావడంతో సమీపంలో ఉన్న శ్రీచక్ర హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడి క్యాజువాలిటీలో ఆమెకు అవసరమైన చికిత్సను అందించి సాయంత్రం ఇంటికి పంపించారు. మరుసటి రోజైన బుధవారం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అదే రోజు రాత్రి ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి ఆమె మరణించినట్లు ధ్రువీకరించారు. కాగా గురువారం ఉదయం అనిత కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పెద్ద ఎత్తున శ్రీచక్ర హాస్పిటల్‌ వద్దకు వచ్చారు. అనితకు సకాలంలో వైద్యం అందించలేదని, మెరుగైన వైద్యం అందించి ఉంటే బ్రతికేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆందోళన ప్రారంభించారు. ఈ ఆందోళన క్రమంగా ఉద్రిక్తతకు దారి తీసింది. ఒక దశలో ఆసుపత్రిపై రాళ్లు విసిరి అద్దాలు పగులగొట్టారు. ఆ తర్వాత బయట మెడికల్‌షాపుకు ఉన్న పెద్ద అద్దాన్ని, గాజు తలుపును ధ్వంసం చేశారు. ఆసుపత్రిలోకి వెళ్లి కనిపించిన ప్రతి వస్తువును ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో క్యాజువాలిటీ, ఆరోగ్యశ్రీ కియోస్క్, కిటికీలు దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు రామయ్య యాదవ్, నాగరాజురావు, శేషయ్య, విక్రమసింహా, తబ్రేజ్‌లు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విచారణ జరిపి న్యాయం చేయండి

శ్రీచక్ర హాస్పిటల్‌లో డ్యూటీ డాక్టర్‌ ఇచ్చిన మందులు వికటించడం వల్లే తన భార్య అనిత (20) మృతిచెందిందని భర్త వడ్ల నాగేంద్రప్రసాద్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 12వ తేదీన తన భార్యకు జ్వరంగా ఉండటంతో రెండు రోజుల పాటు మాత్రలు మింగినా నయం కాలేదు. ఈనెల 15న శ్రీచక్ర ఆసుపత్రిలో చేర్పించగా వైద్యులు పరిశీలన జరిపి రెండు రోజుల పాటు వైద్యచికిత్సలు చేసి డిశ్చార్జి చేశారన్నారు. మరుసటి రోజు వైద్యం వికటించి తన భార్య మృతిచెందిందని నాగేంద్ర ప్రసాద్‌.. నాలుగో పట్టణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలని ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

అనిత మృతితో సంబంధం లేదు


మాట్లాడుతున్న డాక్టర్‌ విజయకుమార్‌రెడ్డి

అనిత మృతికి ఆసుపత్రికి ఎలాంటి సంబంధం లేదని శ్రీ చక్ర హాస్పిటల్‌ అధినేత డాక్టర్‌ విజయకుమార్‌రెడ్డి చెప్పారు. గురువారం మధ్యాహ్నం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనిత అనే యువతి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జ్వరంతో చికిత్స నిమిత్తం వచ్చిందని, క్యాజువాలిటీలోనే సాయంత్రం వరకు ఆమెకు అవసరమైన మందులు ఇచ్చి, ఫ్లూయిడ్స్‌ పెట్టామన్నారు. ఆమె కోలుకోవడంతో ఇంటికి వెళ్తానంటే పంపించామన్నారు. మరుసటి రోజు రాత్రి అత్యవసర పరిస్థితిలో కుటుంబసభ్యులు ఆమెను క్యాజువాలిటీకి తీసుకొచ్చారని, అప్పటికే ఆమె మృతి చెంది ఉందన్నారు. ఆమె మృతికి, ఆసుపత్రికి ఎలాంటి సంబంధం లేదని, ఆసుపత్రిపై దాడులు చేయడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన వారిపై తాము పోలీసులకు ఫిర్యాదు చేశామని, దాడిపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. సమావేశంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్‌ రామచంద్రనాయుడు, డాక్టర్‌ ఎస్వీ రామమోహన్‌రెడ్డి, డాక్టర్‌ బాలమద్దయ్య, ప్రైవేటు ఆసుపత్రుల సంఘం అధ్యక్షులు డాక్టర్‌ వేణుగోపాల్‌ పాల్గొన్నారు.

85 రోజుల్లో 8వ సారి

- పరిచారకుడి హుండీ దొంగతనం ఘటనలో విస్తుపోయే నిజాలు
- సీసీ ఫుటేజీలో చోరీ దృశ్యాలు
- ఇద్దరికి చార్జ్‌ మెమోలు, ముగ్గురు సస్పెన్షన్‌
- నలుగురు సెక్యూరిటీ గార్డుల విధుల నిలుపుదల

శ్రీశైలం టెంపుల్‌: శ్రీశైల మల్లికార్జున స్వామి వారి గర్భాలయంలో పరిచారకుడి హుండీ దొంగతనం ఘటనలో విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగు చూస్తున్నాయి. ఈఓ ఆదేశాల మేరకు అధికారులు సీసీ ఫుటేజీను రెండు రోజులుగా పరిశీలించారు. శ్రీశైల దేవస్థానంలో ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజ్‌ 85రోజుల వరకు మాత్రమే ఉంటుంది. ఆ తరువాత డిలీట్‌ అవుతుంది. అందుబాటులో ఉన్న సీసీ ఫుటేజీ పరిశీలించగా 85 రోజుల్లో 8 సార్లు చోరీకి పాల్పడినట్లు తేలింది. ఈ ఘటనలో స్వామి వారి ఆలయ ప్రధాన అర్చకులు హెచ్‌.వీరన్న స్వామి, స్వామి వారి ఆలయ రెండవ షిఫ్ట్‌ పర్యవేక్షకులు శివప్రసాద్‌కు చార్జ్‌ మెమో జారీ చేశారు. అలాగే స్వామి వారి ఆలయ ఉదయం షిఫ్ట్‌ పర్యవేక్షకులు హెచ్‌. నాయక్, టెంపుల్‌ ఇన్‌స్పెక్టర్‌ చిన్నా, వాచ్‌మెన్‌ లక్ష్మీ నారాయణలను దేవస్థాన ఈఓ సస్పెండ్‌ చేశారు. అలాగే నలుగురు సెక్యూరిటీ గార్డులను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు.

దొంగ చేతికి తాళాలు..

స్వామి వారి ఆలయంలో కాంట్రాక్ట్‌ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న పరిచారక హెచ్‌. విద్యాధర్‌ ఆలయ ప్రధాన అర్చకులు హెచ్‌.వీరన్న స్వామికి సమీప బంధువు కావడంతో వేకువజామున ఆలయం తెరిచే పని నిమిత్తం అతనికే తాళాలు ఇచ్చినట్లు సమాచారం. పరిచారిక విద్యాధర్‌ ప్రవర్తనపై అనుమానం వచ్చి కమాండ్‌ కంట్రోల్‌ రూమ్‌ దేవస్థాన ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే పూర్తి స్థాయిలో నిఘా పెట్టాలని ఆదేశించడంతో నిఘాలో అతని వ్యవహారం బయట పడడంతో రెడ్‌ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. చోరీ ఘటన నేపథ్యంలో డబ్బుతోపాటు స్వామి వారి ఆలయంలో బంగారం ఏమైనా చోరీకి గురైందా అనే కోణంలో దేవస్థాన ఈఓ స్వామి వారి ఆలయంలో ఉన్న బంగారంపై 10 మంది దేవస్థాన అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో డిప్యూటీ ఈఓ, ఏఈఓ, పర్యవేక్షకులు ఉన్నారు. త్వరలో ఈ కమిటీ స్వామి వారి ఆలయంలో బంగారం పరిశీలించి నివేదిక సమర్పిస్తారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో చోటు


బీసీసెల్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శివశంకర్‌నాయుడు

నంద్యాల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో జిల్లాలోని శ్రీశైలం నియోజకవర్గానికి చెందిన పలువురికి చోటు లభించింది. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ బీసీసెల్‌ ప్రధాన కార్యదర్శిగా బి.శివశంకర్‌నాయుడు, కార్యదర్శిగా సి.లాలుస్వామి, జాయింట్‌ సెక్రటరీలుగా ఎం.బాలస్వామి, కె.పుల్లయ్యయాదవ్, ఎం.మునీర్‌బాషా, రాష్ట్ర మైనార్టీ సెల్‌ జాయింట్‌ సెక్రటరీగా నసురుల్లాఖాన్‌లను నియమించారు.

మంత్రాలయం తుంగా తీరంలో షవర్లు


షవర్లతో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మంత్రాలయం: తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇటీవల నదీ ప్రవాహంలో కర్ణాటక రాష్ట్రం అర్కెరి మండలానిక చెందిన ముగ్గురు యువకులు గల్లంతై మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శ్రీమఠం, ప్రభుత్వాధికారులు మేల్కొన్నారు. ప్రమాద ఘంటికలు పొంచి ఉండటంతో భక్తుల నదీ స్నానాలకు బ్రేకులు వేశారు. నదిలోకి ఎవ్వరికీ అనుమతి ఇవ్వడం లేదు. స్నానపు ఘాట్‌తో రెండు విభాగాలుగా షవర్లను ఏర్పాటు చేశారు. మహిళలు, పురుషులు వేర్వేరుగా స్నానాలు ఆచరించేలా షవర్ల సముదాయాన్ని నెలకొల్పారు. ప్రత్యేక విద్యుత్‌ మోటార్ల ద్వారా షవర్లకు నీటిని సరఫరా చేస్తున్నారు. తీరం పొడవునా పోలీసులు, సెక్యూరిటీ గార్డ్స్‌ను పహారాగా పెట్టారు. నదిలోకి వెళ్లకుండా ఎప్పటికప్పుడు శ్రీమఠం మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

రూ. 2 వేలు ఇస్తే.. తల్లికి వందనం డబ్బులు వేయిస్తా

- ఇంటర్‌బోర్డులో పనిచేస్తున్నానంటూ ఫోన్‌ కాల్స్‌
- అమాయకులను బురిడీ కొట్టిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి

జూపాడుబంగ్లా: 'మీ అమ్మాయి, అబ్బాయి ఇంటర్‌ చదువుతున్నారా..వారికి తల్లికి వందనం డబ్బులు పడ్డాయా?లేదా?.. నా నంబర్‌కు రూ.2వేలు ఫోన్‌పే చేస్తే 'తల్లికి వందనం డబ్బులు వేయిస్తా'నంటూ ఓ వ్యక్తి మోసానికి పాల్పడుతున్న వైనం వెలుగులోకి వచ్చింది. రెండు రోజులుగా గుర్తు తెలియని వ్యక్తి తన పేరు దామోదర్‌ నాయుడు అని, ఇంటర్‌బోర్డు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నానని పేర్కొంటూ తల్లిదండ్రుల సెల్‌ఫోన్లకు కాల్‌ చేస్తున్నాడు. ముందుగా ఆధార్‌నెంబర్, డేట్‌ఆఫ్‌ బర్త్‌ చెబితే తల్లికివందనం డబ్బుల వివరాలు తెలియజేస్తానని నమ్మబలుకుతున్నాడు. వివరాలు తెలియజేశాక మీ పిల్లల వివరాలు హోల్డ్‌లో ఉన్నాయని, హోల్డ్‌ నుంచి తొలగించి డబ్బులు పడేలా చేయాలంటే తన నంబర్‌ (9110535997)కు రూ.2వేలు ఫోన్‌పే చేయాలని నమ్మబలుకుతున్నాడు. రూ.2వేలు డబ్బుల్లేవంటే కనీసం రూ.వెయ్యి లేదా రూ.700, లేదా రూ.500 లేదా ఎంతుంటే అంత .. ఫోన్‌పే చేయాలని ప్రాధేయపడ్తున్నాడు. ఇతని మాటలను నమ్మి కొంత మంది అతనికి డబ్బులు ఫోన్‌ చేయగా మరికొంత మంది మోసగాడని గ్రహించి జాగ్రత్త పడుతున్నారు. అధికారులు, పోలీసులు దర్యాప్తు చేపట్టి దామోదర్‌నాయుడి మోసాలకు అడ్డుకట్ట వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
DISTANCE EDUCATION
Direct final year/ Regular/ Distance/ Discontunied : 6 months only: 10th, 12th, DIPLOMA, BTECH, BA, BCOM, BSC, MA, MCOM, MSC, BLISC, BBA, BCA, MBA, MCA, BALLB, LLB, BED, DED, MPED, PHD. ✆ 8686172989. [SCA25006151]

REAL ESTATE
PLOT FOR SALE
ఓర్వకల్లు తిప్పాయిపల్లె రోడ్డు మెయిన్‌ రోడ్డుకి నూతన వెంచర్‌లో అన్ని డెవలప్‌మెంట్స్‌తో నెలసరి కంతులతో ఓపన్‌ ప్లాట్లు కలవు. 9246660444. [SCA25006323]

TO - LET
3 BHK spacious,1800 sqft, 1st floor, with car parking, plot.no: 8, Yelkuru Estate, behind D-Mart, Nandikotkur road, kurnool. Details Contact: 94901 25648. [SCA25006341]

SERVICES
ASTROLOGY
రుద్రనాడీ జ్యోతిష్యాలయం, మీ బొటన వేలి గుర్తును బట్టి, పుట్టిన తేదీ ఆధారంగా మీ యొక్క భవిష్యత్తు చెప్పి పరిష్కారం చూపబడును. సాయిబాబా గుడి దగ్గర, కర్నూలు. 95028 85773. [SCA25006356]

WANTED
కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP& డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7995365999 [HA-15998]

స్వామి వివేకానంద ఓల్డేజ్‌ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్‌ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్‌: 5000 ✆ 9959021122, 9959031122 [B-1275588]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రంగస్వామి (ఫైల్‌)

దేవనకొండ: అప్పుల బాధతో గుడిమిరాళ్ల గ్రామానికి చెందిన గువ్వల రంగస్వామి(45) అనే రైతు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తనకున్న మూడు ఎకరాల పొలంతో పాటు మరో రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని ఈయన పంటలు పండించేవారు. గొర్రెలు, పొట్టేళ్ల పెంపకంతో జీవనం సాగించేవాడు. అయితే గతేడాది పంటలు పండలేదు. పిల్లల పెళ్లిళ్లకు దాదాపు రూ.8 లక్షలు దాకా అప్పు చేశాడు. తనకున్న గొర్రెలను అమ్మినా అప్పు తీరకపోవడంతో ఈయన కొడుకు, కోడలు హైదరాబాద్‌కు వలస వెళ్లారు. అప్పుల బాధతో గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగాడు. ఇంటి పక్కన ఉండే వారు ఈ విషయాన్ని పొలంలో పనిచేస్తున్న కుటుంబసభ్యులకు ఫోన్‌ చేసి చెప్పగా హుటాహుటిన ఇంటికి చేరుకున్నారు. 108 అంబులెన్స్‌ ద్వారా కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండకు తరలించారు. రంగస్వామికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతి చెందిన దుల్లయ్య

మంత్రాలయం: మంత్రాలయంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్న వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలివి.. కర్ణాటకలోని ఇడపనూరు పోలీస్‌ పరిధిలోని మల్కాపురం గ్రామానికి చెందిన బోయ దుల్లయ్య కొన్ని రోజులుగా స్థానిక హోటల్‌లో పని మనిషిగా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం ఆయన కాలకృత్యాలు తీర్చుకోవడానికో.. లేదా ఇతరుల ప్రమేయం మేరకో తెలీదు గానీ ఆర్టీసీ బస్టాండ్‌ వైపు వెళ్లాడు. ఆర్టీసీ బస్టాండ్‌ లోపలికి వాహనాలు వెళ్లే స్థలంలో దుల్లయ్య అనుకోకుండా మృత్యువాత పడ్డాడు. మృతుడి ఛాతీ భాగంలో, తొడల భాగంలో కొన్ని కందిన గాయాలు ఉండటంతో అనుమానాలకు తావిస్తోంది.




పోలీసన్నా.. జాగ్రత్త!

భద్రతా చర్యలపై ప్రయాణికులకు అవగాహన కల్పించే పోలీసులే ప్రమాదకర రీతిలో ప్రయాణించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మల్యాలలో సీఎం బందోబస్తు విధులకు హాజరైన పోలీసులు ఒకే ఆటోలో పరిమితికి మించి ప్రయాణించడం గమనార్హం. ఆటోకు వెనుక వైపు ఇరుక్కుని కూర్చోవడం.. మరికొందరు డ్రైవర్‌కు అటూఇటూ వేలాడుతుండటం చూస్తే వీరికి ప్రాణాలతో పాటు కుటుంబంపై ఏపాటి ప్రేమ ఉందో అర్థమవుతోంది. మరి ఉన్నతాధికారులు వీరి రవాణాకు సరైన ఏర్పాట్లు చేశారో లేదో కానీ.. ఇలాంటి ప్రయాణం సురక్షితం కాదని తెలుసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు